ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 15-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని హోంమంత్రి అమిత్ షా ఈరోజు మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు.
- శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకే మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు భారత్ చేరుకున్నారు.
- ప్రపంచంలో భారతదేశం గొప్ప అంచనాలు, బాధ్యతలు కలిగిన దేశంగా నిలుస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- క్షయవ్యాధి, మాదకద్రవ్య వ్యసనంపై పోరాటంలో విజయానికి ప్రజల భాగస్వామ్యం కీలకమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ కలర్ బహూకరించిన కార్యక్రమంలో అమిత్ షా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌ను 2026 మార్చి31 లోపు నక్సల్ రహితంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు పూర్తి ధైర్యంతో, అంకితభావంతో నక్సల్ వ్యతిరేక ప్రచారాన్ని చేపడుతున్నారని కొనియాడారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులకు సరైన విధానాన్ని సిద్ధం చేసిందని, లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస పథకం ఇస్తామని హోం మంత్రి పేర్కొంటూ ...

హోం మంత్రి .. అమిత్ షా (వాయిస్..34 సెకన్లు)

==========================

శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకే మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు భారత్ చేరుకున్నారు. న్యూఢిల్లీలో ఆయనకు కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ సాదర స్వాగతం పలికారు. శ్రీలంకలో ఇటీవల ముగిసిన అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికల తర్వాత అనురా కుమార దిసనాయకే భారతదేశానికి రావడం ఇదే మొదటిసారి. ఆయన తన పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమవుతారు. పరస్పర ప్రయోజనాల దృష్ట్యా ద్వైపాక్షిక అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో కూడా చర్చలు జరపనున్నారు.

==========================

ప్రపంచంలో భారతదేశం గొప్ప అంచనాలు, బాధ్యతలు కలిగిన దేశంగా పేరుగాంచిందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగిస్తూ... ప్రపంచంలో మొదటిగా స్పందించే దేశంగా భారత్ నిలుస్తోందని అన్నారు. భారతదేశం యొక్క ద్వైపాక్షిక సంబంధాలు విదేశాలలో గణనీయంగా పెరిగాయని ఆయన వివరిస్తూ..

మంత్రి జై శంకర్.. (వాయిస్.. 36 సెకన్లు)

=============================

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి సాధించడానికి దేశ ప్రజలకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ యొక్క వ్యక్తిత్వం, చేసిన కృషి ప్రేరణగా నిలుస్తాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. హోంమంత్రి అమిత్ షా కూడా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క గొప్ప వ్యక్తిత్వం, దేశాన్ని బలంగా నిర్మించాలనే సంకల్పం దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే పౌరులకు ఎప్పటికీ మార్గదర్శకమని హోం మంత్రి అన్నారు. 550 కంటే ఎక్కువ సంస్థానాలను ఏకీకృతం చేయడం ద్వారా ఆధునిక భారతదేశ సృష్టికి సర్దార్ వల్లభాయ్ పటేల్ పునాది వేసారన్నారు.

==============================

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో విక్టోరియా మార్కెట్ భవనంలో జియోసైన్స్ మ్యూజియాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఈరోజు ప్రారంభించారు. ఈ అత్యాధునిక మ్యూజియం జియోసైన్స్ లో ప్రజలతో మమేకం అయ్యే హబ్‌గా మారనుంది. శాస్త్రీయ స్వభావాన్ని, విజ్ఞానాన్ని ప్రజలు పంచుకునేలా, భూశాస్త్రాల అద్భుతాలను ప్రదర్శించే విధంగా జీఎస్ఐ జియోసైన్స్ మ్యూజియంను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది.

==============================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలో, అధికార మహాయుతి ప్రభుత్వం యొక్క మంత్రివర్గ విస్తరణ ఈరోజు నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగింది. గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ కొత్తగా చేరిన మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. భారతీయ జనతా పార్టీ నుంచి 16 మంది, శివసేన నుంచి 10 మంది, ఎన్సీపీ నుంచి 8 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్ర బిజెపి చీఫ్ చంద్రశేఖర్ బవాన్కులే రాష్ట్ర ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు. బీజేపీ శాసనసభ్యులు రాధాకృష్ణ విఖే పాటిల్, చంద్రకాంత్ పాటిల్, గిరీష్ మహాజన్, ఎన్సీపీ నేత హసన్ ముష్రీఫ్, శివసేన నేత గులాబ్రావ్ పాటిల్ కూడా కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

క్షయవ్యాధి, మాదకద్రవ్య వ్యసనంపై పోరాటంలో విజయానికి సామూహిక అవగాహన, ప్రజల భాగస్వామ్యం కీలకమని లోకసభ సభాపతి ఓం బిర్లా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో టిబి ముక్త్ భారత్, నషా ముక్త్ భారత్ ప్రచారాలపై అవగాహన కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించారు. 2025 నాటికి టీబీ వ్యాధి నుండి భారత్ కు విముక్తి కలిగించేదుకు తమ మధ్య ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, ప్రచారాలను ప్రజా చైతన్యం కోసం మార్చుకోవాలని పార్లమెంటు సభ్యులను ఓం బిర్లా కోరారు. ప్రజలు ముఖ్యంగా ఈ సవాళ్లను అధిగమించేందుకు జాతీయ సంకల్పం అవసరమని ఓం బిర్లా పేర్కొంటూ..

స్పీకర్.. ఓం బిర్లా.. (వాయిస్..36 సెకన్లు)

==============================

ఉత్తరాఖండ్‌లో, ప్రపంచ ఆయుర్వేద కాంగ్రెస్, ఆరోగ్య ప్రదర్శన పదవ ఎడిషన్ డెహ్రాడూన్‌లో ఈరోజు ముగిసింది. ప్రపంచ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో 12 వేల మంది ప్రతినిధులు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 54 దేశాలు పాల్గొనగా, ఇందులో 300 మంది విదేశీ ప్రతినిధులు హాజరై ఆయుష్ ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు దేశ, విదేశాల నుండి వచ్చిన ప్రతినిధులకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ఆయుష్‌భూమిలో 4 రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో అనేక ముఖ్యమైన చర్చలు జరిగాయని, ఇవి చాలా విస్తృతమైన ఫలితాలను ఇస్తాయని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

==============================

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ లో భాగంగా బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్లో 7 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ లు సెంచరీలు చేయగా భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లు సాధించారు. మరోవైపు మలేషియాలోని కౌలాలంపూర్ వేదికగా జరిగిన అండర్ 19 ఆసియా కప్ తొలి గ్రూప్-ఎ మ్యాచ్లో భారత మహిళల జట్టు పాకిస్థాన్ పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 67 పరుగులకే పరిమితమైంది. 68 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో కమలిని, సానికా చల్కే జోడీ కేవలం 7.5 ఓవర్లలోనే భారత్ ను విజయతీరాలకు చేర్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =